క్లుప్తంగా

మారని కార్మికుల జీవితాలు



తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని యూనియన్ నేత కూరపాటి స్టీవెన్ హెచ్చరించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో శుక్రవారం కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని యూనియన్ నాయకులు ఆదినారాయణ, సుభాని, పిచ్చయ్య, అంకయ్యతో కలసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం సుమారు 30 ఏళ్లకు పైగా ఎదురు చూస్తున్నారని, 318 రోజులుగా దీక్షలు చేస్తున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ చూపి సమస్యను పరిష్కరించడానికి ముందుకు రావాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గురవయ్య, సాంబశివరావు, వెంకటేశ్వరరావు, సూర్యప్రకాష్, కార్మికులు ఏడుకొండలు, శివకుమారి, శారమ్మ, రమాదేవి, రిబ్కా, అంకమ్మ, నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో ఫ్రైడే.. డ్రైడే

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సలామ్ హోటల్ సెంటర్ ప్రాంతంలో డైవర్స్ కాలనీ యూపీహెచ్‌సీ ఆధ్వర్యాన శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ జయరాజు వైద్య, ఆరోగ్య సిబ్బందితో కలసి గృహాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధులు రాకుండా ప్రతి ఒక్కరూ పరిసరాల్లో దోమలు లేకుండా చూసుకోవాలన్నారు. ఉపయోగించని నీటి తొట్టెలు, వాటర్ డ్రమ్ములు, కూలర్లను ప్రతి వారం శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం కళ్ళం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దోమలతో , నీటి ద్వారా వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాతిరెడ్డి, ఏఎన్ఎం శాంతకుమారి పాల్గొన్నారు.

ఫెన్సింగ్ రాష్ట్ర స్థాయి పోటీలకు జెడ్పీ పాఠశాల విద్యార్థులు



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం లింగిసెట్టి సాంబయ్య అన్నారు. పాఠశాలలో శుక్రవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాకినాడలో శనివారం నిర్వహించే రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు పాఠశాల తరఫున ఉమారవళి, లోకేష్, మనోహర్ ఎంపికయ్యారన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పలు ఫెన్సింగ్ పోటీల్లో పాఠశాలకు చెందిన ఏడుగురు క్రీడాకారులు పలు పతకాలు గెలుపొందారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. పీడీ సుజాత, రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఆర్డీఏ గ్రీవెన్స్‌లో 39 అర్జీలు

తాడికొండ: అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారానికి తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో మొత్తం 39 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వార్షిక కౌలు చెల్లింపు, గ్రామకంఠం సమస్యలు, రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ తదితర సమస్యల గురించి పలువురు రాజధాని ప్రాంతవాసులు తమ అర్జీలను అడిషనల్ కమిషనర్ ఎ.భార్గవ తేజకు అందజేయగా ఆయా సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మేనేజ్‌మెంట్ (జీఆర్ఎం) నోడల్ అధికారి పి.జయశ్రీ, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.శేషిరెడ్డి, భాగ్యరేఖ, పి. పద్మావతి, చిన్నికష్ణ, జి. రవీందర్, బి. సాయి శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారయత్నం!

తాడికొండ: మతిస్థిమితం లేని యువతిపై గుర్తుతెలియని యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన తాడికొండలో జరిగింది. తెలిసిన వివరాల ప్రకారం తాడికొండలోని పుల్లయ్య కొట్టు సందులో మతిస్థిమితం లేని ఓ యువతి ఆరుబయట నిద్రిస్తుండగా గుర్తుతెలియని యువకుడు అర్ధరాత్రి యువతి గొంతునొక్కి అత్యాచారయత్నానికి ఒడిగట్టాడు. యువతి తీవ్రంగా ప్రతిఘటించడంతో ముఖంపై గట్టిగా కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. తప్పించుకొన్న బాలిక ఇంటి ఎదురుగా ఉన్న గేటు కొట్టడంతో స్థానికులు అప్రమత్తమై గాలించగా ఎవరూ కనిపించలేదు. పోలీసులకు సమాచారం అందగా సీసీ ఫుటేజీ పరిశీలించినా ఆచూకీ లభించలేదు. పేద కుటుంబానికి చెందిన వారు కావడంతో స్థానికులే ఖాళీ స్థలంలో పాక నిర్మించి ఆసరాగా ఉంటున్నారు. బాలిక తల్లి ఊరికి వెళ్లడం , అన్న వేరే చోట నిద్రించడం గమనించిన దుండగుడు ఈ అఘాయిత్యానికి పాల్పడేందుకు యత్నించాడే. బాలిక బంధువులు వచ్చి తమకు ఎలాంటి కేసులు వద్దని వారిని తీసుకొని వెళ్లారు.

ప్రశ్నిస్తే 'సాక్షి'పై అక్రమ కేసులా..

సర్కారు తీరుపై మండిపడ్డ జర్నలిస్టు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు



తాడికొండలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు

తాడికొండ: నకిలీ మద్యంపై ప్రశ్నిస్తే 'సాక్షి' పత్రికపై అక్కసుతో అక్రమ కేసులు బనాయించడంతో పాటు ఎడిటర్ ధనుంజయరెడ్డిని విచారణ పేరుతో సర్కారు వేధించడం దుర్మార్గచర్య అని జర్నలిస్టు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు మండిపడ్డారు. 'సాక్షి' ఎడిటర్‌ను విచారణ పేరుతో వేధించడాన్ని నిరసిస్తూ శుక్రవారం నియోజకవర్గ కేంద్రం తాడికొండలో తహసీల్దార్ మెహర్ కుమార్‌కు పలువురు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో తప్పొప్పులను ఎత్తిచూపి సామాన్యుడికి బాసటగా నిలిచే మీడియాపై ప్రభుత్వం కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసమన్నారు. పత్రికలో నకిలీ మద్యంపై వరుసగా కథనాలు వెలువడటం, దీని మూలాల వెనుక అధికార పార్టీకి చెందిన నాయకులు ఉన్నారని ఆధారాలతో సహా గుట్టురట్టు చేస్తుండటంతో భయపడిన సర్కారు బెదిరింపులకు పాల్పడుతోందని మండిపడ్డారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి స్థాయి వ్యక్తి మద్యం కల్తీకి పాల్పడితే ప్రభుత్వం దానికి బాధ్యత వహించకుండా కేవలం సస్పెండ్ పేరుతో పక్కకు తప్పించి కేసును తప్పుదారి పట్టించేందుకు యత్నించడం సిగ్గుచేటన్నారు.

సీబీఐ విచారణ చేయించండి

నకిలీ మద్యం దందాతో పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇందులో తెరవెనుక ఉన్న పెద్దలను బయటకు లాగి భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలన్నారు. కార్యక్రమంలో సాక్షి, విశాలాంధ్ర, ప్రజాశక్తి జర్నలిస్టులు కర్రి ఆనందరాజు, రేపూడి శ్రీనివాసరావు, నూతక్కి శ్యామ్ కుమార్, రైతు సంఘం మండల అధ్యక్షులు చింతల భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు వంగా పోలారెడ్డి, మండల ఎస్సీ, మైనార్టీ, బీసీ విభాగం మండల అధ్యక్షులు గుంటి రఘువరన్, షేక్ అజీస్, దమ్మాటి మోహనరావు, షేక్ రహంతుల్లా, షేక్ షంషుద్దీన్, షేక్ ఖలీల్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిమ్మ కౌలు రైతులను ఆదుకోవాలి



నిమ్మరైతులతో సమావేశమైన కౌలు రైతు సంఘం నాయకులు

దుగ్గిరాల: నిమ్మ కౌలు రైతులకు ఇటీవల కురిసిన వర్షాలతో పంట పూర్తిగా దెబ్బతిందని, పూత, పిందె రాలిపోయాయని, ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు అన్నారు. శుక్రవారం దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నిమ్మరైతులతో జెండా చెట్టు వద్ద సమావేశం నిర్వహించారు. షేక్ కరీముల్లా అధ్యక్షత వహించారు. ఎం.హరిబాబు మాట్లాడుతూ నిమ్మ కౌలు రైతులు ఇటీవల కురిసిన వర్షాలకు తోటలో నుంచి నీరు బయటకు వెళ్లడానికి వీల్లేక పూత, పిందె దెబ్బతిందన్నారు. పంటకు కౌలు సుమారు రూ. లక్ష నుంచి లక్షా ముప్పైవేలు ఖర్చైందని తెలిపారు. వారికి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వర రావు, జెట్టి బాల రాజు, ఎం.అంజయ్య, పఠాన్ ఇస్మాయేలు ఖాన్, పి.ప్రభాకర్, జి.ప్రేమానందం, బుజ్జి, పాతిమా, రఫీ, రైతులు పాల్గొన్నారు.

జ్ఞానమ్మ సేవలు మరువలేనివి



ఫిరంగిపురం: ఆడపిల్లల ఉన్నతికి తాడిపత్రి జ్ఞానమ్మ చేసిన సేవలు ఎనలేనివని సెయింట్ ఆన్స్ సుపీరియర్ జనరల్ సిస్టర్ పి.అంతోనమ్మ అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ తెలుగుమీడియం పాఠశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన దివ్యపూజాబలిలో బాల ఏసుదేవాలయ విచారణగురువు ఫాతిమా మర్రెడ్డి, యూనివర్సల్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ పి.బాలస్వామి, మార్నింగ్ స్టార్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మద్దు బాలస్వామి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సెయింట్ ఆన్స్ సంస్థ వ్యవస్థాపకురాలు పునీత జ్ఞానమ్మ చిత్రపటానికి సంస్థ సుపీరియర్ జనరల్ సిస్టర్ అంతోనమ్మ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఈవో ఏసురత్నం, ఎంఈవోలు మహబూబ్‌సుబానీ, రవికుమార్, ప్రొవిన్షియల్ సుపీరియర్ పి.పాల్ట్రీజా, సిస్టర్ ఆన్‌రోస్, పాఠశాల హెచ్ఎం వొట్టి థెరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

- పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వాలి
- లేని పక్షంలో ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో ఎర్రజెండా ఎగరేస్తాం : సీపీఎం నేతలు



ఎంటీఎంసీ కార్యాలయం వద్ద మహాధర్నాలో సీపీఎం నాయకులు, ప్రజలు

మంగళగిరి టౌన్: ఎన్నికలకు ముందు నియోజకవర్గ ప్రజలకు నారా లోకేష్ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని ఎంటీఎంసీ కార్యాలయం వద్ద శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో మహాధర్నా చేశారు. వేలాదిమంది పేదలు ఇళ్లస్థలాల కోసం దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 20 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు, మరో 20 వేల మందికి ఇళ్లపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజధాని అమరావతిలో ప్రైవేటు యూనివర్సిటీలకు వందలాది ఎకరాలు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. మంత్రి లోకేష్ దేశ విదేశాలు తిరిగి అనేక పరిశ్రమలను తీసుకువస్తున్నారని ప్రచారం చేస్తున్నారని ముందు ఆయన ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న పేద ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా ఇప్పటికీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి వి.వి. జవహర్‌లాల్, గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, జిల్లాకార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు తదితర మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబంపై అక్రమ కేసులు!

ఎస్పీ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో బాధితుల నిరసన

నగరంపాలెం: బాధిత కుటుంబంపై, సాక్షులపై అక్రమ కేసులు బనాయించారు. అధికార అండతో 11 మందిపై తప్పుడు కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మేడికొండూరు సిరిపురం గ్రామానికి చెందిన బాధిత మహిళలు వాపోయారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ) ఎదుట శుక్రవారం ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. సిరిపురం బాలిక కేసులో బాధితులపై, సాక్షులపై మేడికొండూరు పీఎస్ సీఐ అక్రమ కేసులు బనాయించారని, తప్పుడు కేసులు నమోదు చేయించి, పలుకుబడి ఉన్న నరేంద్రను వెంటనే అరెస్ట్ చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం మీడియాతో దివ్యవాణి మాట్లాడుతూ గత నెల్లో సిరిపురం గ్రామంలో జరిగిన కొట్లాట కేసులో వారిని ఈ నెల 2న అరెస్ట్ చేశారన్నారు. సాక్షులుగా ఉన్న 11 మందిపై మేడికొండూరు పోలీసులు అక్రమ కేసులు బనాయించారని వాపోయారు. వేరే అమ్మాయి దుస్తులను నేను చించానంటూ నాపైన కేసు నమోదు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పలుకుబడితో అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. మరో బాధితురాలు శ్రీవల్లి మాట్లాడుతూ తమపై దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసిన రోజు రాత్రి ఎస్ఐ తమపై తప్పుడు కేసులు బనాయించారని వాపోయారని. ఇప్పటికీ గ్రామంలో తమపై దాడులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 11 మందిపై నమోదు చేసిన అక్రమ కేసుల్లో చదువుకునే పిల్లలు ఉన్నారని బాధితురాలైన జయరాణి వాపోయారు. తక్షణమే అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయాలని కోరారు.

క్లీన్ ఎయిర్ అంశంపై పోటీలు



విద్యార్థుల పోటీలను పర్యవేక్షిస్తున్న అడిషనల్ కమిషనర్ శకుంతల

మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అంగీకార్ 2025లో భాగంగా విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించారు. మంగళగిరి నగర పరిధిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఎదుట ఉన్న కళావేదికలో శుక్రవారం క్లీన్ ఎయిర్ అంశంపై వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాలుష్యం వల్ల కలిగే నష్టాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. గాలి కాలుష్యంతో కలిగే ఆరోగ్య సమస్యలను వివరించి దాన్ని తగ్గించడానికి అందుబాటులో ఉన్న పరిష్కారాలను విద్యార్థులకు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తద్వారా కాలుష్యాన్ని తగ్గించి స్వచ్ఛమైన వాతావరణాన్ని పొందవచ్చన్నారు. మంగళగిరి నగర పరిధిలోని 27 పాఠశాలలకు చెందిన సుమారు 200 మందికి పైగా విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఇందు, కరుణ్, ఎంటీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ క్రీడా పోటీలు ప్రారంభం




ప్రారంభ కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారులు

మేడికొండూరు: సిరిపురం జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో గుంటూరు స్థాయి డివిజన్ క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా ఏపీ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.కరీముల్లా పాల్గొన్నారు. పోటీల్లో 10 మండలాల నుంచి 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. శుక్రవారం వాలీబాల్, యోగ పోటీలు జరిగాయి. స్థానిక వ్యాయామ ఉపాధ్యాయులు పావులూరి శరత్ బాబు, హుస్సేన్ బాబు ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయి క్రీడల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఈనెల 22వ తేదీన అండర్- 14, అండర్ -17 బాలా బాలికల విభాగంలో ఖోఖో, కబడ్డీ క్రీడా పోటీలు జరుగుతాయని ఫిజికల్ డైరెక్టర్ పావులూరి శరత్ బాబు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు యార్లగడ్డ శ్రీనివాసరావు, కార్యదర్శి సీహెచ్ కొండయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు, పెద్దలు కడియాల హనుమంతరావు, మరిపూడి రాంబాబు, కడియాల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా భవనాలు

సాక్షి ఎఫెక్ట్



తాడికొండలో అందుబాటులోకి రానున్న సచివాలయం భవనాలు

తాడికొండ: మండలంలో నిర్మించి వదిలేసిన సచివాలయ భవనాలను శనివారం ప్రారంభించనున్నారు. దీనికి ఏర్పాట్లు చేశారు. నిరుపయోగంగా మారిన భవనాలపై ఇటీవల 'నిర్మించి.. నిర్లక్ష్యం చేసి' శీర్షికతో 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు వీటిని అందుబాటులోకి తేవడానికి ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా తాడికొండ- 3, సచివాలయం, రైతు భరోసా కేంద్రం శనివారం ప్రారంభించడానికి సన్నాహాలు చేశారు. పొన్నెకల్లులో కూడా సచివాలయ భవనాన్ని అందుబాటులోకి తేనున్నారు.

రోటరీ సేవలు అభినందనీయం



కమిషనర్ అలీమ్‌బాషాను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

మంగళగిరి టౌన్: చేతులు లేని దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమచేతులు పంపిణీ చేస్తున్న రోటరీ సేవలు అభినందనీయమని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్‌బాషా అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో 'మంగళకరమ్' పేరుతో జరుగుతున్న ఉచిత కృత్రిమ చేతుల పంపిణీ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. అలీమ్‌బాషా మాట్లాడుతూ చేతులు లేని దివ్యాంగులకు జర్మనీ టెక్నాలజీతో కృత్రిమ చేతులు అందించడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో రోటరీ మరెన్నో మంచి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. వారు చేసే సేవా కార్యక్రమాలకు ఎంటీఎంసీ సహకారముంటుందన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు ప్రగడ రాజశేఖర్ మాట్లాడుతూ 160 మంది దివ్యాంగులకు కృత్రిమ చేతులు అమర్చామన్నారు. అనంతరం కమిషనర్ అలీమ్‌బాషాను రోటరీక్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రాజశేఖరరెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ పూర్ణ చంద్, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి కార్యదర్శి నిరంజన్ గుప్తా, ప్రాజెక్ట్ చైర్మన్ అనిల్ చక్రవర్తి తదితర రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కృపాలక్ష్మిపై ఎమ్మెల్యే వ్యాఖ్యలు హేయం



దాసరి కత్తిరేణమ్మ

ఫిరంగిపురం: జీడీనెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త కృపాలక్ష్మిపై స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ థామస్ చేసిన అనుచిత వ్యాఖ్యలు హేయమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళావిభాగం ప్రధాన కార్యదర్శి, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. శాంతిపేటలోని తన నివాసంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ మహిళలను కించపరిచేలా ఎమ్మెల్యే థామస్ చేసిన వాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. మహిళల చీరలు, బొట్టు, మేకప్‌ల గురించి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడటం సభ్యతకాదన్నారు. నకిలీ మద్యంపై మహిళలు చేస్తున్న పోరాటాలకు భయపడి నాయకులు అనేక రకాలుగా అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారని ప్రజలు అంతా గమనిస్తున్నారన్నారు. ఎందరో మగవారు కల్తీ మద్యం తాగి ప్రాణాలు కోల్పోతుంటే కూటమి ప్రభుత్వానికి పట్టదా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రంలో అనేక ప్రాంతాల మహిళలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రశ్నిస్తుంటే వారిపై అనేక రకాలుగా మాట్లాడటం సరికాదన్నారు. మహిళా నాయకురాలు కృపాలక్ష్మిపై ఎమ్మెల్యే థామస్ చేసిన వాఖ్యలు ఉపసంహరించుకోవాలని ఆమెకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, మహిళలు ఉన్నారు.

సీజేఐపై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

ఎమ్మార్పీఎస్ నాయకులు




తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తాడేపల్లి రూరల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయిపై దాడిచేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి చందోలు విక్టర్ పాల్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి దేశ న్యాయవ్యవస్థ మీద, ప్రజాస్వామ్య స్ఫూర్తి మీద, రాజ్యాంగంపై జరిగిన దాడిగా దేశ ప్రజలు భావించాలన్నారు. రాజ్యాంగంతో ఈ దేశంలో దళిత వర్గాలు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, గౌరవం, గుర్తింపును సంపాదించుకున్నారని పేర్కొన్నారు. దాడి వెనుక శక్తులను గుర్తించి వారికి శిక్షలు పడేలా స్వతంత్ర దర్యాప్తు చేయాలని కోరుతున్నామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అనంతరం డెప్యూటీ తహసీల్దార్ రిజ్వాన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు అద్దేపల్లి నాగేశ్వరరావు, మహిళా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, మంగళగిరి మండల అధ్యక్షులు కుమార్, వడ్డేశ్వరం పున్నయ్య, సాంబయ్య, కిషోర్, క్రీస్తుదాసు, అనీల్ పాల్గొన్నారు.

దుగ్గిరాల: సీజేఐ గవాయ్‌పై దాడిని న్యాయవ్యవస్థపై దాడిగా భావిస్తున్నామని దుగ్గిరాల మండల ఇన్‌చార్జి కలకోటి నాగేశ్వరరావు మాదిగ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు అందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి, జెండాలు తీసుకుని నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా తహసీల్దారు కార్యాలయం చేరుకున్నారు. దాడికి పాల్పడిన రాకేష్ కిషోర్ పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు ఐ.సునీతకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ విభాగాల నాయకులు నాతానియేలు మాదిగ, శ్యామల మాదిగ, అరుణ మాదిగ, బుజ్జి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

• మర్కటం.. ప్రాణ సంకటం



కోతుల చేష్టలు చూడటానికి వినోదంగా ఉండొచ్చు కానీ గ్రామాల్లో వాటి తీరు మితిమీరి ప్రాణ సంకటంగా మారుతున్నాయి. ఇళ్లలో, పొలాల్లో చొరబడి నానా ఆగడాలు చేస్తున్నాయి. ఇళ్లపైకి వచ్చి ప్రజలపై దాడులు చేస్తున్నాయి. పంట పొలాల్లోకి వచ్చి సాగుకు ఆటంకం కలిగిస్తున్నాయి. వీటితో ఎదురయ్యే ఇబ్బందులపై, రహదారి వెంబడి పొలాల్లో పని చేసిచేసే రైతులు, వాహనచోదకులు.. దాడి చేస్తున్న కోతుల సమస్యను పరిష్కరించాలని ఎమ్మార్పీస్ లీగల్ సెల్ స్టేట్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ కోరారు. శుక్రవారం దుగ్గిరాల మండలంలోని చిలువూరు, కంఠంరాజుకొండూరు గ్రామాల్లో వందల సంఖ్యలో ఉన్న కోతులు మందలుగా వలస వచ్చి గ్రామ ప్రజలను తీవ్రమైన ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. వందల ఎకరాల్లో పొలాల్లో విధ్వంసం సృష్టిస్తుండటంతో పేద రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని తెలిపారు. మహంకాళి అమ్మవారి గుడి వద్దకు నిత్యం భక్తులు వస్తుంటారని సమస్య తీవ్రతను అర్థం చేసుకుని కోతుల బెడద తొలగించాలని కోరుతున్నారు.

– దుగ్గిరాల

పరిశుభ్రతలో ముందంజ వేయాలి

మేడికొండూరు: మండలంలోని గ్రామాలన్నీ పరిశుభ్రత, పచ్చదనంలో ముందంజ వేయాలని లక్ష్యంగా పెట్టుకుని, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 'క్లీన్ అండ్ గ్రీన్'పై విస్తృత స్థాయి శిక్షణ సమావేశం జరిగింది. మండల పరిషత్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల నుంచి ఇద్దరు ఎస్.హెచ్.జి వీవోఏలు, ఇద్దరు ఎస్.హెచ్.జి సభ్యులు సహా మొత్తం 56 మంది ప్రతినిధులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శి జి.హరిబాబు, డిజిటల్ అసిస్టెంట్లు తాడిశెట్టి వెంకట్రావు, షేక్ రిజ్వాన్ శిక్షకులుగా వ్యవహరించి, ప్రొజెక్టర్ ద్వారా పారిశుద్ధ్య నిర్వహణ, మొక్కల పెంపకంపై వివరంగా అవగాహన కల్పించారు. ఎంపీడీఓ డేవిడ్ ప్రభాకర్, డెప్యూటీ ఎంపీడీఓ పూర్ణ శంకరరావు క్లీన్ అండ్ గ్రీన్ ప్రాధాన్యాన్ని వివరించారు. మేడికొండూరును రాష్ట్రంలోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐటీసీ ప్రతినిధులు పాల్గొని సహకరించారు.

కాలుష్య రహిత దీపావళి జరుపుకొందాం

తాడేపల్లి రూరల్: కాలుష్య రహిత దీపావళిని జరుపుకోవాలని ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల కోరారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి అరవింద హైస్కూల్లో ఎకో ఫ్రెండ్లీ దివాళి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. అడిషనల్ కమిషనర్ శకుంతల మాట్లాడుతూ దీపావళి సందర్భంగా టపాసులు కాల్చడంతో గాలి కాలుష్యం, శబ్ద కాలుష్యం, వ్యర్థాలు విడుదల కావడంతో పర్యావరణంపై, ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని పేర్కొన్నారు. పర్యావరణ హితమైన దీపావళిని జరుపుకొనే అలవాటును పెంపొందించేందుకు 'స్వచ్ఛాంధ్ర'లో భాగంగా క్లీన్ ఎయిర్ అనే థీమ్ మీద కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, స్కిట్స్ వేసి, పాటలు పాడారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది, మున్సిపల్ సచివాలయ సిబ్బంది, ఐఈసీ కో ఆర్డినేటర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.